ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై జరిమానా
హోటళ్లు, వ్యాపార సంస్థల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న హోటళ్లు, వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించి జరిమానా విధించినట్లు ఎంహెచ్ఒ డాక్టర్ మాలతి తెలిపారు. స్థానిక మెయిన్ బజార్‌లో గురువారం పలు హోటళ్లు, ఫ్యాన్సీ, వ్యాపార దుకాణాల్లో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఒ మాలతి మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల ప్రకారం నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు రూ.14 వేలు జరిమానా విధించి కవర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేందర్, సుబ్బారావు, సచివాలయ, పారిశుధ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక జిల్లాగా పోలవరం

'ఉమ్మడి పశ్చిమ'లో 2014 పునరావృతం
బిసిలకు ప్రత్యేక నిధులేవీ
పోలవరం ప్రాజెక్టును చూడాలని చంద్రబాబు పట్టు
అడ్డుకున్న పోలీసులు..
రోడ్డుపైనే బాబు బైఠాయింపు
ఏలూరు జిల్లాలో ముగిసిన చంద్రబాబు పర్యటన


కొయ్యలగూడెం రోడ్‌షోలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, కొయ్యలగూడెం, పోలవరం

పోలవరం మండలాలన్నింటినీ కలిపి ప్రత్యేక జిల్లాగా చేస్తానని టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 స్థానాలు టిడిపి, మిత్రపక్షం గెలుచుకుందని, ఇప్పుడు మరోసారి అదే పునరావృతం కానుందని, వైసిపికి ఒక్కసీటు కూడా రాదని ఆయన తెలిపారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో గురువారం రెండోరోజు పర్యటన కొయ్యలగూడెం, పోలవరం మండలాల మీదుగా సాగింది. ఉదయం 11.30 గంటలకు నరసన్నపాలెంలోని దండమూడి రామలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో బిసి నాయకులతో ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షత వహించారు. ముందుగా తూర్పుకాపు, గౌడ, శెట్టిబలిజ, యాదవ, కొప్పువెలమ, వడ్డి, కుమ్మరి, రజక, ఉప్పర, విశ్వబ్రాహ్మణ సామాజిక తరగతులకు చెందిన నాయకులు మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఏలూరు పార్లమెంట్ స్థానాన్ని బిసిలకు కేటా యించాలని, ఏలూరు జిల్లాలో రెండు అసెంబ్లీ స్థానాలు బిసిలకు కేటాయించాలని కోరారు. ఆదరణ పథకం కొనసాగించాలని, కల్లుగీత కార్మికులకు చెట్లు నాటుకునేందుకు భూమి కేటాయించాలని పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ టిడిపికి బిసిలు వెన్నుముకని అన్నారు. పశ్చిమలో అన్ని స్థానాలనూ మరోసారి గెలుచుకుంటామన్నారు. బిసిలు ఆర్థికంగా, రాజకీయంగా ఇంకా ఎదగలన్నారు. 54 సాధికారిక కమిటీలను ఏర్పాటు చేసి బిసిల సమస్యలను తెలుసుకుని, ఏం చేయాలో నిర్ణయిస్తామన్నారు. అందరికీ ఇచ్చే కార్యక్రమాలు కాకుండా బిసిలకు ప్రత్యేక నిధులు కేటాయించకుండా చేశారన్నారు. కీలకమైన అన్ని పదవులనూ రెడ్లకు కట్టబెట్టారన్నారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 20 శాతం కేటాయింపులు చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం 39 మంది బిసి నేతలను పొట్టనబెట్టుకుందన్నారు. 650 మందిపై కేసులు పెట్టారన్నారు. వైసిపి ఆఖరి గడువు దగ్గర పడిందని హెచ్చరించారు.

బిసిల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

పోలవరంలో ఉద్రిక్తత

బిసిలతో సమావేశం ముగిసిన తర్వాత చంద్రబాబు తన పర్యటనను సాగించారు. బయ్యన్నగూడెంలో చంద్రబాబుకు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అక్కడ నుంచి కొయ్యలగూడెం చేరుకున్న చంద్రబాబు సెంటర్లో మాట్లాడారు. వైసిపిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పోలవరం నిర్వాసితులకు పది లక్షల ప్యాకేజీ, భూములకు రూ.ఐదు లక్షలు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. మాటలకు.. చేతలకు పొంతన లేదన్నారు. ఇంతలో మద్యం తాగిన వ్యక్తి అక్కడే పడిపోగా, ఇదే నిదర్శనమని, జగన్ ఇలాంటి మద్యం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులు అతన్ని తీసుకు వెళ్లి మంచినీళ్లు పట్టించాలన్నారు. 'జగన్ రావడం మా అదృష్టం' అంటూ కొయ్యలగూడెంలో కొంతమంది వైసిపి కార్యకర్తలు ఫ్లెక్సీలు పట్టుకుని నినాదాలు చేశారు. అన్నా క్యాంటీన్లు మళ్లీ ప్రారంభిస్తామన్నారు. అనంతరం దిప్పకాయలపాడులో చంద్రబాబు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి చంద్రబాబు ముందుకు సాగారు. కన్నాపురంలో పెద్దఎత్తున జనం చేరడంతో చంద్రబాబు మాట్లాడుతూ గోరంత ఇచ్చి కొండంత దోచేస్తు న్నారన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం అంతా ఆలోచించాలన్నారు. అక్కడ నుంచి ఎల్ఎన్‌డిపేట మీదుగా చంద్రబాబు పోలవరం చేరుకు న్నారు. చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు వద్దకు వెళ్లే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు ముందస్తుగా అప్రమత్తయ్యారు. ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డుకు బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు వాహనాలను సైతం అడ్డంగా నిలిపారు. పోలవరం చేరుకున్న చంద్రబాబు ప్రాజెక్టు వద్దకు వెళ్తానని పట్టుబట్టారు. దీంతో పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మావోయిస్టుల ప్రమాదం ఉందని, వారోత్సవాలు జరుగుతున్నాయని, రాత్రి అయ్యిందని పోలీసులు తెలిపారు. తనను ఎప్పుడు వెళ్లమంటారని పోలీసులను చంద్రబాబు నిలదీశారు. అరగంటపాటు పోలవరంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. అనంతరం జీపుపైకి చేరుకుని సభలో ప్రసంగించారు. పోలవరంను చిదిమేశారని, తాను కట్టిన ప్రాజెక్టు వద్దకు తనను వెళ్లనివ్వకపోవడం దారుణమన్నారు. గిరిజనులకు, రైతులకు తీరని అన్యాయం చేశారన్నారు. అనంతరం కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటన సాగించారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటన సాగనుంది. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పేదల సాగు భూములకు పట్టాలివ్వాలి
కొనసాగిన వ్యకాస రాష్ట్ర మహాసభ ప్రచార జాతా

టి.నర్సాపురంలో..

ప్రజాశక్తి - టి.నరసాపురం

గిరిజనులు, పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ డిమాండ్ చేశారు. వ్యకాస 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ఆటో ప్రచార యాత్ర మూడో రోజు గురువారం మండలంలోని అప్పలరాజుగూడెం, అబ్బులాపురం, సాలిగూడెం, మధ్యాహ్నపువారిగూడెం, బచ్చులేటివారిగూడెం, రామన్నగూడెం, అల్లూరి సీతారామరాజు నగర్ మీదుగా చింతలపూడి చేరింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు హక్కు పత్రాలు ఇవ్వాలని, బచ్చులేటిగూడెం పోడు భూములకు, మంగళమెట్ల సాగుదారులకు సాగు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు నగర్ గుడిసెవాసులకు కరెంటు, నీళ్లు సౌకర్యం కల్పించి పోడు కొట్టి సాగు చేసుకున్న భూమికి సాగు పత్రాలు మంజూరు చేయాలన్నారు. సురంపూడి గట్టున 40 సంవత్సరాలుగా సాగు చేస్తున్న దళితులు, గిరిజనులు, పేదలకు పంట పరిహారం చెల్లించాలని, భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7, 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో దండమూడి రామలక్ష్మి కళ్యాణమండపంలో జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడకం సుధారాణి, సమ్మగ్గాల సాయికృష్ణ, భూపోరాటాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాట్రాయి: వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ ప్రచార జాతా గురువారం చాట్రాయి చేరుకుంది. ప్రధాన సెంటర్లో జరిగిన సభలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషు మహంకాళిరావు మాట్లాడుతూ భూమి, కూలీ, ఉపాధి ప్రధాన సమస్యలుగా మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిల్లి మురళి, నేతలు జమ్ముల మహేష్, మేడేపల్లి హోలీ మేరీ, సిఐటియు మండల కార్యదర్శి కొలికపోగు భాస్కర్, మీసాల కుమార్ పాల్గొన్నారు.

చింతలపూడి: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ప్రచార యాత్ర గురువారం పట్టణం మీదుగా సాగింది. బోసుబొమ్మ సెంటర్లో మహాసభలకు సంబంధించిన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నేత తుమ్మల సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.సూర్యకుమార్, సాయికృష్ణ, కుమారి, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షులు సత్తు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ప్రచార జాతాను సంఘ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిల్లి మురళి ప్రారంభించారు. కార్యక్రమంలో శేషు మహంకాళిరావు, జక్కుల మహేష్, మీసాల కుమార్, జహంగీర్ భాషా పాల్గొన్నారు.

కుక్కునూరు: ఈ నెల 8,9,10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం గోడపత్రికలను ఆవిష్కరించారు. మండలంలో అన్ని ప్రాంతాల్లో వాల్‌పోస్టర్లు అంటించారు. అనంతరం జరిగిన సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.స నాయకులు బయ్యన శ్రీను, మహబూబ్ పాషా, బాబు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: వ్య.కా.స రాష్ట్ర మహాసభకు మండలం నుంచి వెయ్యి మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాజులపల్లి దానియేలు తెలిపారు. మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలో ఆటో ప్రచార యాత్ర చేపట్టారు. అనంతరం మండల జనరల్ బాడీ సమావేశం దానియేలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మహాసభకు కష్టజీవులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు తెల్లం దుర్గారావు, నేలబారి అప్పారావు, సిరిబత్తుల సీతారామయ్య, చిట్టిబొమ్మ కొండలరావు, గుండె గంగరాజు, తెల్లం శంకరుడు పాల్గొన్నారు.

బిసిలను అణగదొక్కిన జగన్
ఆత్మీయ సమావేశంలో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాయ మాటలతో బిసిలను సిఎం జగన్ అణగదొక్కారని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం స్థానిక బైనేరువాక శివారులో ఉన్న దండమూడి రామలక్ష్మి వశిష్ట కళ్యాణ మండపంలో బిసిలతో సమావేశం నిర్వహించారు. తొలుత టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్యామచంద్ర శేషు ఆధ్వర్యంలో బిసి ఫెడరేషన్ ఛైర్మన్ కొల్లు రవీంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన బిసిల ఆత్మీయ సమ్మేళనంలో చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.మహాత్మ జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన బిసి సామాజిక తరగతి నాయకులు పలు సమస్యలను చంద్రబాబుకు వివరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ బిసిలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని కోరారు. బిసిలు మరింత ఎదగాలన్నారు. 56 బిసి సాధికార కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. వీరంతా ప్రజలకు వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు బిసి సామాజిక తరగతులకు 25 నుండి 34 శాతం వరకూ పదవులు కేటాయించామని గుర్తు చేశారు. కానీ నేడు జగన్ మాయమాటలతో గద్దెనెక్కి బిసిలను నట్టేట ముంచారని విమర్శించారు. స్థానిక సంస్థల్లో 24 శాతం తగ్గించడం వల్ల బిసిలు రాష్ట్రంలో 16,800 పదవులు కోల్పోయారని తెలిపారు. రాష్ట్రంలో 140 బిసి కులాలు వెనుకబడి ఉన్నాయని తెలిపారు. 40 సంవత్సరాలుగా బిసిలు తనకు అండగా ఉన్నారన్నారు. తన హయాంలో బిసిల అభివృద్ధికి రూ.36,400 కోట్లు కేటాయించి రూ.30 వేల కోట్ల వరకూ ఖర్చు చేశామని గుర్తుచేశారు. వైసిపి ప్రభుత్వం టిటిడి నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బిసి కులాలకు కేటాయించాల్సి ఉండగా కేవలం ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించి రెడ్డి సామాజిక తరగతికి ప్రాధాన్యతిచ్చారని విమర్శించారు. గీత కార్మికులకు తెలంగాణ మాదిరిగా మద్యం షాపుల్లో 20శాతం అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, మాజీ రాజ్యసభ సభ్యులు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ చంద్రబాబు సందడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


చంద్రబాబు వేషధారణలో సత్యనారాయణ

మాజీ సిఎం చంద్రబాబు పర్యటనలో జూనియర్ చంద్రబాబు పలువురిని ఆకట్టుకున్నాడు. గురువారం బిసి సామాజిక తరగతుల సమ్మేళన కార్యక్రమాన్ని స్థానిక బైనేరువాగు సమీపంలోని దండమూడి రామలక్ష్మి వశిష్ట కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుండి తరలివచ్చిన టిడిపి శ్రేణులకు జూనియర్ చంద్రబాబుగా కనిపించిన శ్రీరాప సత్యనారాయణను ఆసక్తిగా తిలకించారు. ఉంగుటూరు నియోజకవర్గం ఫతేపురానికి చెందిన ఆయన చంద్రబాబు అభిమానిగా తన రూపాన్ని మార్చుకుని ఇలాంటి పర్యటనల్లో పాల్గొంటానని తెలిపారు. తన అభిమాన నాయకుడు రూపంలో పర్యటించడం పలువుని ఆకట్టుకోవడం సంతృప్తిని కలిగిస్తుందని చెప్పాడు. అలాగే పలువురు జూనియర్ చంద్రబాబుతో సెల్ఫీలు దిగారు.

ఎలిజాపై చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన
దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - చింతలపూడి

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చింతలపూడిలో పర్యటించిన చంద్రబాబు ఎంఎల్ఎ ఎలిజాపై చేసిన వ్యాఖ్యలను నిరసిసూత వైసిపి నేతలు, కార్యకర్తలు స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్లో ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. దీన్ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ కార్యకర్తలు కొందరు దిష్టిబొమ్మను పక్కకు తీసుకెళ్లి పెట్రోలు పోసి నిప్పంటించి దహనం చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణాధ్యక్షులు కొప్పుల నాగు, సొసైటీ ఛైర్మన్ ఆత్కూరి సుబ్బారావు, ఎంఎల్ఎ సోదరుడు జీవన్, సిటీ మెడికల్ అధినేత దుర్గారావు, వెంపా కృష్ణ, మోహన్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి
జిల్లావ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - కలిదిండి


కలిదిండిలో అధికారులకు వినతిని అందిస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పున:ప్రారంభించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. 1214 మెమోను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, రూ.1280 కోట్లు సంక్షేమ బోర్డుకు జమచేయాలని, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందచేశారు. తొలుత మార్కెట్ యార్డ్ కార్యాలయం నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు పోతురాజు బాలాజీ, పరసా రాజేష్, కటికల శ్రీనివాస్, బత్తిన సూరిబాబు, అబ్దుల్ అక్బర్, సుంకర హరి, సానబోయిన సత్యన్నారాయణ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోని భువనపల్లి, అడవికొలను, పెదనింద్రకొలను, ఛానమిల్లి గ్రామ సచివాలయాల్లో కార్యదర్శులకు భవన నిర్మాణ కార్మికులు వినతిపత్రాల అందించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు మాట్లాడుతూ నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోసూరి శివ, రోకలి ఏసురెడ్డి, కానూరు శ్రీనివాసు, చినిమిల్లి రాంబాబు, సోడాబత్తుల శివ, ఆసుప హరిప్రసాద్ పాల్గొన్నారు.

పెదపాడు: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అమలు ప్రారంభించాలని, పథకాలను నిపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 1214 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండలం కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు మండల కార్యదర్శి రెడ్డి లక్ష్మణరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ముమ్మడి గోపాలకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం దారి మళ్లించిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డుకు జమచేయాలని, బోర్డును యథావిధిగా నిర్వహించాలని కోరారు. సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు నష్టపోకుండా కార్మికుల సంక్షేమ చట్టాలను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.వెంకట అప్పారావు, డి.సురేష్, ఎం.ప్రభాకర్, షేక్ కరీముల్లా, కె.ఆంధ్రేసు, ఎ.నాగరాజు, జి.సుకాంత్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : భవన నిర్మాణ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ పథకాలను రాష్ట్రప్రభుత్వం నిలుపుదల చేసి వారి బతుకులపై దెబ్బకొట్టిందని సిఐటియు జిల్లా కార్యదర్శి కొక్కిరిపాటి వెంకట్రావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ ఎవి.రమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రాజన్న రాజ్యం తెస్తానని ఎన్నికల్లో ఊదరగొట్టిన సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను నిలుపుదల చేశారన్నారు. పన్నుల రూపంలో వసూలైన రూ.1280 కోట్ల నిధులను దారి మళ్లించారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెద్ద ప్రజాస్వామ్యవాదిగా ఫోజులు పెట్టి అధికారంలోకి రాగానే నియంతలాగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ బీమా కార్మికులకు అందడం లేదని, ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయడం మినహా మృతిచెందిన కార్మికులకు బీమా పరిహారం ఇవ్వడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లయిములను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు సీరా అప్పారావు, అనుపోజు వీరవెంకటబ్రహ్మం, వానపల్లి వీర్రాజు, ఎం.నాని, సూర్యనారాయణ, కె.రాంబాబు, మరడాని సోమాచారి, దివిలి రాంబాబు, ఎం.శ్రీనివాసరావు, కొత్తలంక శేషారావు, ఎం.వెంకట్, కె.సిద్దాచారి పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలు సచివాయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందించినట్లు నిర్మాణ కార్మికుల సంఘం మండల కార్యదర్శి చిట్టిబొమ్మ కొండలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కొయ్యలగూడెం : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల నిలుదలను విరమించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని దిప్పకాయలపాడు సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ ఎస్.కృష్ణ, షేక్ బాష, సురేష్ కృష్ణ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహనా సదస్సులు
డిఎంహెచ్ఒ బి.రవి

ప్రజాశక్తి - చాట్రాయి

డెంగీ ప్రబలిన ప్రాంతాల్లో అవగాహనా సదస్సులు పెద్దఎత్తున నిర్వహించాలని డిఎంహెచ్ఒ బి.రవి వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక దళితవాడలో బుధవారం మరణించిన మొండ్రు బాబూరావు కుటుంబాన్ని ఆయన గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ బాబూరావు మృతికి గల కారణాలు తెలుసుకున్నానన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని, మందులు వాడాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీజనల్ వ్యాధులతోపాటు విష జ్వరాలు, డెంగీ, టైఫాయిడ్ వంటి వాటిపై జనాలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి లీనా బెంజిమెన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎస్.రమణ, ఎఎన్ఎం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఇఒపిఆర్‌డి ఎం.శివనాగరాజు పాల్గొన్నారు.

పొగాకు అనర్థాలపై విస్తృత ప్రచారం
ద్వారకాతిరుమల క్షేత్ర పరిధిలో ధూమపానం నిషేధం - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో గురువారం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంపై వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పొగాకు ఉత్పత్తుల వినియోగ నియంత్రణ, ద్వారకాతిరుమల ఆలయ పరిసరాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం నిషేధం అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అంతేకాక కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నారని అన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు మరింత అవగాహన కల్గించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగం చట్టరీత్యా నేరమనే విషయాన్ని, వాటివల్ల ప్రజలకు కలిగే అనారోగ్య సమస్యలు తెలియజేసేందుకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని దేవాలయాల పరిసరాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం నిషేధం తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ముందుగా ద్వారకాతిరుమల ఆలయ పరిసరాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం, అమ్మకం నిషేధాన్ని అమలు చేసేందుకు ఆలయ సిబ్బందికి, భద్రతా సిబ్బందికి 21 రోజులపాటు శిక్షణ అందించాలని, అనంతరం దేవాలయ పరిసరాలను 'స్మోక్ ఫ్రీ' ప్రాంతంగా గుర్తిస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని దేవాలయాల్లో భద్రత సిబ్బంది ఆయా దేవాలయాల పరిసరాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం, అమ్మకాలపై నిఘా పెట్టాలని, ఆయా గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధ చట్టంపై మైకులు తదితర మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించాలని అన్నారు. అతిక్రమించిన వారిపై జరిమానా విధించాలని, పలుమార్లు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని అన్నారు. ఎన్‌సిడి ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ మానస మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం చట్టరీత్యా నేరమనే అంశం, పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు మరింత అవగాహనా కల్గించేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ద్వారకాతిరుమల ఆలయ పరిసరాల్లోని దుకాణాలు, సిబ్బంది వివరాలను తీసుకుని వారికి బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం నిషేధం, ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగం, అమ్మకాలపై నిషేధం పటిష్ఠంగా అమలు చేయడంపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవి, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఇఒ వి.త్రినాధరావు, డిసిఎం వెంకట్, సైకాలజిస్టులు చిన వీర్రాజు, గణేష్ పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి నిధులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

శంకుస్థాపన చేస్తున్న మేయర్

పార్కులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఈడ ఛైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరాం అన్నారు. స్థానిక 30వ డివిజన్ ఆర్ఎంఎస్ కాలనీ పార్కు అభివృద్ధికి ఈడ నిధుల నుండి రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఆ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న మేయర్ నూర్జహాన్ పెదబాబు, ఈశ్వరి బలరాం మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సిఎం ఏలూరు శాసనసభ్యులు ఆళ్ల నాని ఆదేశాల మేరకు పార్కు అభివృద్ధికి ఈడ నిధుల నుండి రూ.25 లక్షలు కేటాయించామన్నారు. పార్కు అభివృద్ధిలో భాగంగా కొత్తగా పచ్చదనం కోసం గడ్డిని తీసుకొచ్చి వేయడం, పార్క్‌లో ఉన్న గడ్డిని చక్కగా కత్తిరించడం, ఇసుకతో నింపడం, గ్రానైట్ రాళ్లు వేయడం, వాచ్‌మెన్ షెడ్డు నిర్మాణం, మెయిన్ గేటును సరిచేయడం, రంగులు వేయడం తదితర పనులను చేసి పార్కును అందంగా, ఆహ్లాదకరంగా తయారు చేస్తామన్నారు. పార్కుకు వస్తున్న ప్రజలు పార్కు పరిసర ప్రాంతాలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్ఎంఎస్ కాలనీ కమిటీ ముఖ్యంగా ఈ భాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రతీ సచివాలయ పరిధిలో పారిశుధ్య పనులు, విద్యుత్ దీపాలు, రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, ఇళ్ల స్థలాలు వంటి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలిస్తూ పరిష్కరించడం జరుగు తుందన్నారు. ప్రతీ సచివాలయ పరిధిలో రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులను చేపడతామ న్నారు. ఈ కార్యక్రమంలో ఈడ వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్, స్థానిక కార్పొరేటర్ పప్పు ఉమా మహేశ్వరరావు, డిఇ వంగపండు సత్యనారాయణ, తోట శివ, ఆర్ఎంఎస్ కాలనీ కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


భూమి హక్కు పత్రాలను అందిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

సమగ్ర భూసర్వేతో రైతుకు భరోసా

ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

సమగ్ర భూ సర్వేతో రైతుకు భరోసా ఉంటుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని రైతు కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయిలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద శాశ్వత హక్కుపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంస్కరణలు సంకల్పించడం ప్రణాళికలు రచించడం వాటిని చిత్తశుద్ధితో అమలు చేయడం జగనన్న పాలనా విధానానికి నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో భూ తగాదాలకు తావులేకుండా ఎవరి భూములపై వారికి హక్కులు, రక్షణ కల్పిస్తూ రైతుకు భరోసా కల్పించిన జగనన్నకు రైతులు రుణపడి ఉన్నారన్నారు. నియోజకవర్గంలో తొలి దశలో 25 గ్రామాల్లో రీసర్వేలో 23,421 ఎకరాలు సర్వే చేసి 13,267 మంది రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలిస్తున్నామని చెప్పారు. ఆర్‌డిఒ పెంచల కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ రీసర్వే ప్రశంసనీయమన్నారు. దీని వల్ల భూతగదాలకు స్వస్తి జరుగుతుందని.. రైతన్నకు శాశ్వత భరోసా కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడివి వెంకటకృష్ణ మోహన్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపిపిలు చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, భట్రాజు శివాజీ, కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు పుష్పలత పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఇకెవైసి ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెల్లింపు కోసం డ్వాక్రా సభ్యుల కెవైసి నమోదు బుధవారం నుంచి ప్రారంభమైందని జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా తెలిపారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ తొలి విడతలో 1444 స్వయం సహాయక సంఘాలకు రూ.12.57 కోట్లు, రెండో విడతలో 1447 స్వయం సహాయక సంఘాలకు రూ.12.67 కోట్లు చెల్లింపులు జరిగాయన్నారు. మూడో విడతగా 1447 సంఘాలకు చెందిన 14,288 మందికి లబ్ధి చేకూరనుందన్నారు. మండల పరిధిలోని 13 పంచాయతీలకు చెందిన 46 గ్రామ సంఘాల ఆధ్వర్యంలో ఆసరా చెల్లింపు కార్యక్రమాన్ని ఐకెపి అధికారులు చేపడతారని తెలిపారు.

జగనన్న ఇళ్ల రుణం రూ.ఐదు లక్షలకు పెంచాలి

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి రుణం రూ.ఐదు లక్షలకు పెంచాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడిలోని జగనన్న కాలనీలను సిపిఐ బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఐదో తేదీన సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, మండల కార్యవర్గ సభ్యులు దంతా కృష్ణ, చింతలపూడి పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జానీ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు, ఎం.లాజరు, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి తుర్లపాటి రాజు ఉన్నారు.

గ్రేస్ మందిర్ ఆధ్వర్యాన ఐక్య క్రిస్మస్ ర్యాలీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలవ్యాప్తంగా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సహకారంతో గ్రేస్ మందిర్ అధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ శాంతి ర్యాలీ నిర్వహించినట్లు పాస్టర్ బి.ఎజ్రాశాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిపి కొర్సా పోసమ్మ, తహశీల్దార్ జి.ఎలీషా జెండా ఊపి ప్రారంభించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో సర్పంచి చిర్రి జగదాంబ, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, సురేష్, పసుపులేటి రాము, రాజబాబు, రఘు, కె.సత్యనారాయణ, సంఘస్తులు పాల్గొన్నారు.

లింగవివక్ష నశిస్తేనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి - మండవల్లి

లింగ వివక్షను వీడితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని సర్పంచి ఎన్.జాన్సీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లింగవివక్షకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేటి కాలంలో కూడా ఆడ-మగ తేడాలను గుర్తించడం బాధాకరమన్నారు. ప్రస్తుత కాలంలో స్త్రీలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని గుర్తు చేశారు. పురుషులతో సమానంగా ఉద్యోగాలను నిర్వహిస్తూ సత్తా చాటుతున్నారని ఆమె వివరించారు. లింగ వివక్షను వీడి స్త్రీల పట్ల గౌరవమర్యాదలతో నడుచుకోవడం వల్ల సమాజం ఉన్నత స్థానంలో ఉంటుందని ఆమె తెలిపారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సిడిపిఒ గంగాభవాని, సూపర్‌వైజర్లు కల్పవల్లి జాన్సీ, మల్లేశ్వరి, బండా సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ అపూర్వ భరత్

ప్రజాశక్తి - మండవల్లి

రెవెన్యూపరమైన సేవలు ప్రజలకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయానికి వచ్చే వారితో సహృదయంతో మెలుగుతూ వారి వినతులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పట్టాదారు పాసు పుస్తకాలకు దరఖాస్తు చేస్తున్న విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీనివాస్, రాజేష్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.


సంధ్యను సత్కరిస్తున్న నాయకులు

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సంధ్యకు సత్కారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంటా సంధ్య బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం ముదినేపల్లిలోని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కార్యాలయంలో ఆమెను ఘనంగా సత్కరించారు. శాలువా కప్పి పూలమాలలతో అభినందించారు. కేక్ కట్ చేసి సంధ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైస్‌ఎంపిపిలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, వైసిపి మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, వైసిపి నాయకులు బొర్రా శేషుబాబు, కె.విష్ణువర్ధన్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, సాక్షి సాయి, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాభక్షు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు గుగ్గర శ్రావణి, గంటా కోటేశ్వరరావు, రాచూరి కుమార్, దివి సతీష్, బేతు రాజా పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అవగాహనతోనే ఎయిడ్స్‌కు చరమగీతం

ప్రజాశక్తి - చాట్రాయి

ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిఎంహెచ్‌ఒ బి.రవి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రమైన చాట్రాయిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి లీనా, బెంజిమెన్, జివి.రమణ, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : బండివారిగూడెం ఎంపియుపి పాఠశాలలో మండల వైద్యాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే సందర్భంగా వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం భాగ్యలక్ష్మి, సుశీల, సిహెచ్‌ఒ రమ్య, ఆశా వర్కర్లు పార్వతి, నాగమణి, మహిళా పోలీస్ వెంకటసాయి ప్రసన్న, డిజిటల్ అసిస్టెంట్ నరసింహ, స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గణపవరం : పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు ఆర్.రోహిత్ మాట్లాడుతూ ఎయిడ్స్‌ను పారదోలేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సిహెచ్‌ఒ జి.విల్సన్‌బాబు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ మండల అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి, జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు, విఎస్.శ్రీనివాసరావు, సిహెచ్‌ఎస్ ప్రభాకర్‌రావు, పానకాలు పాల్గొన్నారు.

చింతలపూడి : విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి ఇబ్రహిం షరీఫ్ అన్నారు. పట్టణంలోని చైతన్య భారతి జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ బి.రవి, ప్రిన్సిపల్ జి.ప్రసన్న కుమార్, న్యాయవాదులు మీసాల రమేష్, సోషల్ వర్కర్ ఎమ్‌డి అక్బర్ అలీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు : మండల పరిధిలో ఎయిడ్స్ రోగులు పెరగడంపై సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇంతవరకు 3600 మందికి పరీక్షలు నిర్వహించగా 79 మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ క్రమంలో ప్రతినెలా పది నుంచి 12 వరకూ కొత్త కేసులు నమోద వుతున్నాయని తెలిపారు. ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని, వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని, నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రతీ గర్భిణితోపాటు టిబి సోకినవారు విధిగా ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్షలను భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. టిబి వ్యాధిగ్రస్తులకు స్థానికంగా మందులు, వైద్యం అందజేస్తామని, భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం లింక్ ఎటిఆర్ కేంద్రం కావడం వల్ల ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఏలూరు ప్రభుత్వ వైద్యశాల, ఆశ్రం వైద్యశాల ఎటిఆర్ కేంద్రంలో మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. వారికి పౌష్టికాహారం కొనుగోలుకు పింఛన్లను ప్రభుత్వం అందిస్తుందన్నారు.

కొయ్యలగూడెంలో..

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ఐసిటిసి కౌన్సిలర్ సింహాద్రి మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని సమానత్వం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఈ ర్యాలీని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్ర పర్యవేక్షకులు డాక్టర్ శ్వేత ప్రారంభించారు. ర్యాలీలో శ్రీవెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సభ్యులు నినాదాలు చేస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా నిలబడి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులు సునీత, డాక్టర్ రేష్మీ, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురంలో..

నూజివీడు: కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలేజ్ ఆఫ్ పీజీ స్టడీస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీజీ సెంటర్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ వి.వెంకటరాము జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ షేక్ అన్వర్ బాష, డాక్టర్ టి.నాగరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్థానిక యుజిపిహెచ్‌సిలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైద్యాధికారులు తస్లీమా, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, సెంటర్‌లో మానవహారంగా నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గంజిమాల రామారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు సూరిబాబు

జగనన్న ఇళ్లు వేగవంతం చేయాలి : జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - టి.నరసాపురం

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్‌పిటిసి సభ్యులు సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) సూచించారు. మండలంలోని తిరుమలదేవిపేట పరిధిలోని వెంకటాపురం జగనన్న కాలనీ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు మాట్లాడుతూ లేఅవుట్‌లలో ఇళ్ల పూర్తయ్యేలా అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.తిరుపతి స్వామి, నాయకులు దాకారపు సూరిబాబు, యర్రా గంగాధరావు, హౌసింగ్ ఎఇ రాధాకృష్ణ, విఆర్‌ఒ ఫణికుమార్ పాల్గొన్నారు.

పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ

ప్రతినిరుపేదకూ సంక్షేమ ఫలాలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రతి నిరుపేదకూ సంక్షేమ పథకాలు అందించేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప అప్పారావు అన్నారు. మండలంలోని చనుబండలో గడపగడపకూ మన ప్రభుత్వాన్ని గురువారం నిర్వహించారు. ప్రతీ కుటుంబాన్ని సందర్శిస్తూ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ డి.రాఘవరెడ్డి, సర్పంచి విస్సంపల్లి జ్యోతి, ఎంపిపి లంక నిర్మల పాల్గొన్నారు.

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ముసునూరు

భూగర్భ జలాల రక్షణకు రైతులు రబీలో ఆరుతడి పంటలు వేసుకోవాలని జలవనరుల శాఖ ఎపిడి టి.శివనాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని గుడిపాడులోని ధర్మవరం చెరువు ఆయకట్టు రైతులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ పిజిఎం ఎస్.భూషణం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పూర్తికాగానే రబీ పంటకాల సమయంలో గ్రామంలోని రైతులందరూ కలిసి ఆరుతడి పంటలు సాగుచేసుకునేందుకు ప్రణాళికబద్ధంగా మినుములు, సజ్జలు, పెసలు, మొక్కజొన్న, మిరప వంటి పంటలు ఎంచుకుని సాగుచేయాలన్నారు. చిరుధాన్యాల పంటలకు దిగుబడి తక్కువ వచ్చినప్పటికీ ధర అధికంగా ఉండటంతో పాటు పెట్టుబడి తగ్గుతుందన్నారు. వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గుచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టీకల్చర్ ఆఫీసర్ హేమ, సేవ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ రాజకుమార్, రైతులు గద్దే రఘుబాబు, కొల్లి గంగారామ్, మండలపు ధర్మరాజు, రాజబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

ప్రమాదకరంగా రోడ్డుపై నిర్మాణ సామగ్రి
పట్టించుకోని కాంట్రాక్టర్
నీటిపైపులైన్లు పగులుతున్నా
స్పందించని వైనం
ప్రజలు, వాహనదారులు ఆగ్రహం

ప్రజాశక్తి - మండవల్లి

పామర్రు జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న పనులు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. గుత్తేదారుడు పనులకు ఉపయోగిస్తున్న యంత్రాలను రహదారికి అడ్డంగా నిలుపుదల చేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మండవల్లిలో జాతీయ రహదారిపై గురువారం ఓపక్క పొక్లెయిన్‌ను నిలుపుదల చేసి మరో పక్క కాంక్రీట్ మిక్సర్‌ను అడ్డంగా పెట్టారు. ఈ క్రమంలో గుత్తేదారుడికి, వాహనదారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది.

రోడ్డుపైనే నిలిపిన పొక్లెయిన్, మిక్సర్ లారీ

వివరాలిలా ఉన్నాయి. మండవల్లిలో జాతీయ రహదారి విస్తరణ పనులు సాగుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ సంబంధిత పోల్స్ వేయడంతో పాటు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. గుత్తేదారుడు నిర్మాణ పనులు చేపట్టే క్రమంలో రహదారి వెంబడి ఉన్న పైప్‌లైన్లతోపాటు వ్యక్తిగత కుళాయిలను ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. పైపులకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో గ్రామస్తులు నీటికోసం అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా డ్రెయినేజీ ఏర్పాటుకు నిర్వహిస్తున్న గుంతల్లో వచ్చిన నీటిని పొక్లెయిన్ తొట్టితో తీసి జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా పోస్తున్నారు. ఆ మురుగునీటిలో ప్రయాణించలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనులు చేపట్టే ప్రాంతాల్లో పనులు జరుగుతున్నట్లు కనీసం సూచిక బోర్డులను కూడా ఏర్పాటు చేయడంలో గుత్తేదారుడు విఫలమయ్యాడు. దీనిపై వాహనదారులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆయన్ను నిలదీసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుత్తేదారునిపై చర్యలు తీసుకోవాలని, సూచికబోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలని కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీనివాస్‌ని వివరణ కోరగా ఇప్పటికే డిఇ సత్యనారాయణతో మాట్లాడామని, మరోసారి మాట్లాడి తగుచర్యలు తీసుకుంటామని చెప్పారు.

అడ్డంకులు తొలగిస్తూ.. శరవేగంగా జగనన్న గృహాలు

పొలసానిపల్లి సర్పంచి షేక్ రహీమా బేగంహసేన

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు సహాయ సహకారాలతో స్థానికంగా గృహ నిర్మాణాలు చేపట్టిన జగనన్న కాలనీల ప్రగతికి అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు చేపట్టామని పొలసానిపల్లి సర్పంచి షేక్ రహీమా బేగంహసేన తెలిపారు. గ్రామ పరిధిలోని జగనన్న కాలనీలో 48 గృహాలను నిర్మించేందుకు అనుమతులు లభించాయి. గ్రామపంచాయతీ ఆ కాలనీలో వాసన్న గృహ సముదాయం పేర ఇళ్లు నిర్మించేందుకు తీర్మానం చేసింది. స్థల సేకరణ పూర్తిచేశారు. అర్హులైన లబ్ధిదారులకు స్థలాల కేటాయించారు. గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన కనీస సౌకర్యాలను పంచాయతీ కల్పించింది. కానీ కాలనీ మీదుగా వెళ్లిన విద్యుత్ వైర్లు నిర్మాణాలకు అడ్డంకిగా మారడంతో వీరిలో 15 మంది మాత్రమే ఇప్పటి వరకూ గృహ నిర్మాణాలను ప్రారంభించారు. దీనిపై స్పందించిన సర్పంచి సమస్యను శాసన సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శాసనసభ్యులు విద్యుత్ స్తంభాలను తొలగించి వేరొక చోట విద్యుత్ లైన్ వేసేందుకు రూ.ఏడు లక్షల నిధులు మంజూరుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ట్రాన్స్ కో అధికారులు స్తంభాల బదిలీ, విద్యుత్‌లైన్ల ఏర్పాటు చేపట్టాల్సి ఉందన్నారు. ఆ ప్రాంతంలో స్థల సేకరణ జరిగిందన్నారు. కానీ అక్కడికి చేరుకునేందుకు అనుసంధాన రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థల సేకరణ చేయాలని సంబంధిత అధికారులకు శాసనసభ్యులు ఆదేశించారన్నారు. ఇదే క్రమంలో కాలనీ మీదుగా వెళ్లిన 11 కెవి విద్యుత్ లైన్‌ను గృహ నిర్మాణాలకు అడ్డంకి లేనివిధంగా వేరే ప్రాంతాలకు మార్చేందుకు శాసనసభ్యులు. రూ.4 లక్షలు కేటాయింపు చేశారన్నారు.

ఈ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచితోపాటు పాల్గొన్న ఎంపిటిసి ఎ.దేవి, వైసిపి ఉంగుటూరు నియోజకవర్గస్థాయి మైనార్టీ సెల్ నాయకులు షేక్ హసేన, వైసిపి ప్రముఖులు అంబటి నాగేంద్రప్రసాద్ సిబ్బందికి సహకారం అందజేశారు. అనంతరం సర్పంచి మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన రెండో జగనన్న కాలనీలో 103 గృహాల నిర్మాణాలు పనులను సైతం ఒకటి రెండు రోజుల్లో చేపట్టనున్నామన్నారు. ఇదేవిధంగా గ్రామానికి గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు శాసనసభ్యులు రెండు విడతలుగా రూ.60 లక్షలు జల జీవన మిషన్ నిధులు కేటాయించారన్నారు. వీటితో గ్రామంలో తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచి వివరించారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి సేవిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణ పరిధిలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో గంజాయి సేవిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ ఎంవివిఎస్‌ఎన్.మూర్తి తెలిపారు. సిఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన యువకుడు షేక్ యాసీన్(22) గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. యాసిన్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని చెప్పారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లారీ ఢీకొని సైకిలిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం జరిగింది. స్థానిక బైనరువాగు వంతెన వద్ద కొయ్యలగూడెం మండలం సీతంపేట నుండి జంగారెడ్డిగూడేనికి సైకిల్‌పై వస్తున్న అల్లం నాగేశ్వరరావు (57)ను వెనుక నుండి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు రెండు కాళ్లు నుజ్జయ్యాయి. లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో గుర్తించలేదని స్థానికులు తెలిపారు. నాగేశ్వరరావును స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు.

3న 'ప్రభుత్వ విధానాలు - రవాణా రంగంపై ప్రభావం' జిల్లా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ విధానాలు రవాణా రంగంపై ప్రభావం అనే అంశంపై ఈనెల మూడో తేదీన ఏలూరు కొత్తబస్టాండ్ సమీపంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు అఖిలభారత రవాణారంగ కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుద్దా నాగసూరిబాబు, జినగం గోపి, ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఏలూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.అమర్‌కుమార్, జివి.రవీంద్రబాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు అఖిల భారత రవాణా రంగం కార్మికుల ఫెడరేషన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని డ్రైవర్లందరూ హాజరై జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆలయానికి వెండి విరాళం

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెంలో జరుగుతున్న వైభవంగా జరుగుతున్న షష్టి ఉత్సవాలు గురువారానికి నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యాత్రికులు స్వామివారికి పెద్దఎత్తున విరాళాలు అందజేశారు. అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం చేయించేందుకు కొండిపర్రుకు చెందిన కీర్తిశేషులు ముత్యాల రాంబాబు జ్ఞాపకార్థం వారికుమారుడు ముత్యాల సాంబశివరావు 500 గ్రాములు వెండిని విరాళంగా ఇచ్చారు. విజయవాడకు చెందిన తమ్మారెడ్డి పట్టాభి రామారావు, అరుణ దంపతులు స్వామివారికి కళ్యాణపీట విరాళంగా అందచేశారు. పెద్దఎత్తున యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు తెలిపారు.

సమగ్రంగా ఓటర్ల జాబితా

ఏలూరు: భారత ఎన్నికల సంఘ కార్యాలయం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం సాయంత్రం 26 జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ వివరాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా సరాసరి నిష్పత్తి ఉండేలా ఓటర్ జాబితాలు పోలింగ్ కేంద్రాల వారీగా తెచ్చుకొని వాటిలో గ్యాప్‌లను పూరించాలని, అందుకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఖచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితా తయారీకి ప్రత్యేక దృష్టి పెట్టాలని, అభ్యంతరాలు, చేర్పులు, మార్పులపై రానున్న వారంలో ప్రత్యేక ప్రత్యేక దృష్టి సారించి నూటికి నూరు శాతం స్పష్టతతో కూడిన జాబితా తయారీలో నిమగ్నం కావాలని జిల్లా అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణపై సమీక్షలు చేస్తూ పురోగతిని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్ర, జెడ్‌పి సిఇఒ రవికుమార్, ఏలూరు, జంగారెడ్డి ఆర్‌డిఒలు పెంచల కిషోర్, ఝాన్సీరాణి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: తణుకు

O.S.No. 326/2021

బిట్వీన్:

విజయబ్యాంకు, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా, తణుకు ...వాది

మరియు

1) రేలంగి పద్మావతి
2) రేలంగి నరసింహమూర్తి

...ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికినిన్ని అమలు జరగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. పై నెంబరు గ్రంధము **ది.08-12-2022వ తేదీకి వాయిదా ఉన్నది.** కావున సదరు తేదీకి మీరు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని అనగా మీ ప్లీడరు గారి ద్వారా ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు కావల్సిందిగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. అట్లు హాజరు కానిచో సదరు గ్రంధము మీ పరోక్షములో తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తణుకు, 01-12-22. ఓ.ఎన్.కృష్ణ అడ్వకేట్, తణుకు.